నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

శుక్రవారం 29 డిసెంబర్ 2023
FRIDAY, DECEMBER 29, 2023 | VIKARABAD | పేజీలు : 8 PAGES




అబ్దుల్లాపూర్‌మెట్‌లో మహిళ నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి




## క్యూ కేవైసీ

గ్యాస్ కనెక్షన్ ఈ- కేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీలకు జనం పరుగులు పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల్లో ఒకటైన రూ. 500లకే సిలిండర్ పథకం వర్తించాలంటే కేవైసీ చేసుకోవాలన్న వదంతులతో ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిల్చొని కేవైసీ పూర్తి చేసుకుంటున్నారు. గ్యాస్ ఏజెన్సీల వద్దకు రావొద్దని, ఇంటివద్దకు డెలివరీ బాయ్ వచ్చినప్పుడే కేవైసీ చేసుకోవాలని సిబ్బంది సూచిస్తున్నా జనం వినిపించుకోవడం లేదు. ఆమగనల్లు పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ కేంద్రం వద్ద గురువారం ఉదయం ప్రజలు ఇలా పెద్ద ఎత్తున క్యూలో నిలబడ్డారు. -ఆమనగల్లు, డిసెంబర్ 28

# 'ప్రజా పాలన' షురూ..

**మొదటిరోజు వెల్లువెత్తిన దరఖాస్తులు**

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో లాంచనంగా ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఆయా నియోజక వర్గాల్లో శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యేలు..
- మొదటిరోజు పెద్ద ఎత్తున దరఖాస్తుల రాక
- ఫారాల కొరతతో ఇబ్బందులు పడ్డ ప్రజానీకం
- అధిక ధరలకు విక్రయించి క్యాష్ చేసుకున్న జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు

ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం తొలిరోజు సందడిగా సాగింది. ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో నిర్వహించిన 'ప్రజాపాలన'ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయా నియోజకవర్గాల్లో జరిగిన గ్రామ సభలను స్థానిక ఎమ్మెల్యేలు ప్రారంభించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లాలో గురువారం 98 గ్రామ పంచాయతీలు, 16 మున్సిపాలిటీల పరిధిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. వంద మందికి ఒక కౌంటర్ చొప్పన మొత్తం 713 కౌంటర్లను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున దరఖాస్తులను స్వీకరించారు. అదే విధంగా వికారాబాద్ జిల్లాలోనూ పెద్ద ఎత్తున దరఖాస్తులు అందాయి. కాగా అధికారులు తీసుకొచ్చిన దరఖాస్తు ఫారాలు ఏ మూలకూ చాలకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే అదునుగా భావించిన జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు అందినకాడికి దండుకున్నారు.

-న్యూస్ నెట్‌వర్క్, (నమస్తే తెలంగాణ)


సెంటర్ స్ప్రెడ్‌లో..






వికారాబాద్ : అధికారులకు ప్రజాపాలన దరఖాస్తులను సమర్పిస్తున్న మహిళలు

# మినీ టు మెయిన్..

- వికారాబాద్ జిల్లాలో 138 మినీ అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్.. టీచర్లకు పెరుగనున్న వేతనం



**మినీ అంగన్‌వాడీ కేంద్రాలను** ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో వికారాబాద్ జిల్లాలో 138 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. జిల్లాలో ఇదివరకు 969 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ప్రస్తుతం మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో వీటి సంఖ్య 1107కు చేరింది. గిరిజన ప్రాంతాల్లో 300కు పైగా జనాభా, అర్బన్ ప్రాంతాల్లో 400కు పైగా జనాభా ఉన్న చోట్లలోని మినీ కేంద్రాలను ప్రభుత్వం ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఫలితంగా ఇందులో పని చేసే టీచర్ల వేతనం పెరుగడంతో పాటు ప్రతి కేంద్రానికీ సహాయకురాలిని నియమించనున్నారు.

–బొంరాస్‌పేట, డిసెంబర్ 28